


నేడు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించనున్నదని, జిల్లా కేంద్రంలోని జిల్లా మహాత్మా జ్యోతిబా పూలే బీసీ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు జిల్లాస్థాయి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా మహాత్మా జ్యోతిబా పూలే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చిత్తూరు జిల్లాలో రాష్ట్రప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బీసీ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ వర్గాలకు చెందిన 500 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11,66,30,000 విలువ గల ఆస్తుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ కులసంఘ నాయకులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

రైతు కష్టాలు తీరేనా..?

- నేడు మామిడి రైతుల సదస్సు
- మ్యాంగో బోర్డు, గిట్టుబాటు ధర కల్పించాలంటున్న రైతన్నలు



ధరలేక రోడ్డు పక్కన పారబోసిన మామిడి కాయలు (ఫైల్)

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

మామిడి రైతులు, కొనుగోలుదారుల సదస్సు ఈనెల 11వ తేదీ శుక్రవారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో నిర్వహించేందుకు ఉద్యానవనశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్‌పీసీ పెవిలియన్ కన్వేన్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 9 నుండీ సాయంత్రం 5గంటల వరకు మామిడి రైతులు, కొనుగోలుదారులతో 2025 మామిడి అమ్మకాలపై సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, 500 మంది మామిడి రైతులు పాల్గొనే అవకాశమున్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లాలోని ఎంఎల్‌ఏలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు.

జిల్లాలో అత్యధికంగా మామిడి పంట రోజురోజుకి విస్తరిస్తోంది. జిల్లాలోని 32 మండలాల్లో 1,50,000 ఎకరాలు మామిడి పంట సాగులో ఉంది. దాదాపు లక్ష మంది రైతులు ఈ పంటపై ఆధారపడి సాగు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న బంగారుపాళ్యం, తవణంపల్లి, ఐరాల, పెనుమూరు, యాదగిరి మండలాల్లో అత్యధికంగా మామిడి పంట సాగులో ఉంది. ప్రతి సంవత్సరం మామిడి రైతుకు నష్టాలు వచ్చి అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. కేవలం పాలకులు విధానాల వల్లనే రైతులు నష్టపోతున్న పరిస్థితి ఉంది. మామిడి రైతులను ఆదుకొని వారికి కావలసిన మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతు సంఘాలు, మామిడి రైతులు దీర్ఘకాలికంగా పోరాటం చేస్తున్నారు.

2021లో తోతాపూరి రకం కిలో రూ.5లకు పడిపోవడంతో ఆగ్రహానికి గురైన మామిడి రైతులు జిల్లా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై మామిడి కాయలు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పడేసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రధాన వాణిజ్యపంట చెరకు నష్టాలు మిగల్చిడంతో రైతులు ఎక్కువగా మామిడి తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం కూడా మామిడి పంటను పండిస్తే ప్రోత్సాహకంగా రుణమిస్తూ ప్రోత్సహించింది. ఉపాధి హామీ కింద చెట్లు నాటుకోవడానికి అవకాశం కల్పించారు. దీంతో రైతాంగం మామిడి వైపు మొగ్గు చూపారు. ఏటా మామిడి సాగు పెరుగుతోంది. అయితే దీనికి సంబంధించి ప్రతి సంవత్సరం ప్రైవేటు మామిడి పరిశ్రమ యాజమాన్యాలు సిండికేట్‌గా మారి రైతుల దగ్గర కారు చౌకగా పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతాంగం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని లబోదిబోమంటూ చేసిన అప్పులకి వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి సంవత్సరం జిల్లా కలెక్టర్ మామిడి రైతులు, పల్ఫ్ యజమానులతో సమావేశం నిర్వహించి ధర నిర్ణయిస్తున్నా ఆ మేరకు ఫ్యాక్టరీ యజమాన్యం ఇవ్వకపోగా కొన్ని పల్ఫ్‌ఫ్యాక్టరీ తిరిగీ మరో ఏడాది మామిడి సీజన్ వచ్చేంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో మామిడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు యాజమాన్యాలు గత సంవత్సరం జిల్లాల్లో 2లక్షల టన్నుల పల్ఫ్‌ను ఉత్పత్తి చేశారు. దీనికి అంతర్జాతీయంగా మార్కెట్ బాగా ఉండేది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ పడిపోవడంతో మామిడి గుజ్జును తయారుచేసి పరిశ్రమల్లోనే నిల్వ ఉంటున్నాయి. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు చొరవ తీసుకొని విదేశాలకు ఎగుమతి చేసే విధంగా చర్యలు తీసుకోకపోవడమే. మామిడి గుజ్జు పరిశ్రమల ఉండడం వలన రైతుల దగ్గర నుంచి కొత్తగా పంటను కొనే పరిస్థితి తక్కువగా ఉంది. దీంతో ఇంకా రైతాంగం భారీస్థాయిలో నష్టపోయే పరిస్థితి ఉంది. ఈ సంవత్సరం 50 శాతం మామిడి పంట దిగుబడి వచ్చే అవకాశాలున్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పసుపు, కొబ్బరి, పొగాకు తరహా చిత్తూరు జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది. మామిడి గుజ్జు పరిశ్రమ సిండికేట్‌ను అరికట్టి తోతాపూరి రకం మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.




గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి
- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్



ఐదు ఎకరాల లోపు రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించాలి. పరిశ్రమలలో నిల్వ ఉన్న మామిడి గుజ్జును ప్రభుత్వం అధికారులు చొరవ చూపి ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు, పుణ్యక్షేత్రాలైన తిరుమల తిరుపతి దేవస్థానం, కాణిపాకం ఇతర ఆలయాలు దగ్గర భక్తులకు మామిడి జ్యూస్‌ను అందించాలి. మ్యాంగో బోర్డు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలి. మామిడి రైతులకు అవగాహన సదస్సు సందర్భంగా ప్రభుత్వం, అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి
-ఉమాపతి నాయుడు, జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



ప్రతి ఏటా సీజన్లో వచ్చే మామిడి పండ్లు చంటిపిల్లల నుంచి పెద్దలు, వయోవృద్ధుల వరకు అందరూ నోరూరిస్తూంటాయి. మన చిత్తూరు జిల్లాలో పండించే మామిడి పండ్లను తినడమే కాకుండా జ్యూస్ రూపంలో కూడా తీసుకోవడంతో రుచితోపాటు ఆరోగ్యంగా ఉంటుంది. ఇలాంటి మామిడి పండ్లకు ప్రభుత్వాలు ఏళ్ల తరబడి ఎందుకు మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు. జిల్లాలో వెంటనే మ్యాంగో బోర్డును ఏర్పాటు చేసి మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి.

తరచూ నీటిని టెస్టింగ్ చేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ విజయ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావుతో కలసి వేసవిలో తాగునీటి సమస్య లేకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలుపై గ్రామీణ నీటి సరఫరా శాఖ డిడిలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలని, క్లీనింగ్ చేసే సమయంలో ఫోటోలు తీసి జిల్లా కలెక్టర్‌కు పంపించాలన్నారు. అదేవిధంగా తాగునీటి పైపులు లీకేజీ ఉన్న వాటిని వెంటనే రీప్లేస్మెంట్ చేయాలన్నారు. డీఈలు వారి పరిధిలోని మండలాల్లో పర్యటించి గ్రామాలలో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఏఈలు మండల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీతో సమన్వయం చేసుకొని ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలని, తాగునీటి సరఫరా అయ్యే పైపులు మరమ్మతులకు గురైతే మురుగునీరు కలసి కలుషితంతో రకరకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. నిరంతరం తాగునీటిని ల్యాబ్‌లకు పంపి టెస్టింగ్ చేయించాలన్నారు. ఏఈలు, పంచాయతీ సెక్రెటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమన్వయంతో పని చేయాలన్నారు. 15 ఆర్థిక సంఘ నిధులతో చేసి పనులకు సంబంధించి బిల్స్‌ను వెంటనే జడ్పీకి పంపించాలన్నారు. జడ్పీలో బిల్స్ వెంటనే క్లిరిన్స్ చేయాలని జడ్పీ ఏఓను ఆదేశించారు. అవసరమైన చోట బోర్లు వేసి ఉంటే మోటర్లు బిగించి వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. గత 15 రోజులలో 17 గ్రామాలలో ట్రాన్స్పోర్టేషన్ చేయడం జరిగిందని, సిపిడబ్ల్యుఎస్ ద్వారా విజయపురం, నింద్ర మండలాలలో 44 హ్యాబిటేషన్స్‌లోని 21722 జనాభాకు తాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఎస్ఈ వివరించారు.

సిమెంట్ రోడ్డు, కాలువలు ప్రారంభించిన ఎమ్మెల్యే



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేసి, ప్రారంభోత్సవాలు చేస్తున్నామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారం నగరపాలక పరిధిలోని లాయర్స్ కాలనీ, ఎస్పీ బంగ్లా రోడ్డులో పలు అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. 4వ వార్డు పరిధిలోని లాయర్స్ కాలనీలో రూ.20లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, కాలువను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. లాయర్స్ కాలనీ ప్రజలు, కాలనీ అసోసియేషన్ వినతి మేరకు సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మించామని.. మిగిలిన పనులను రాబోయే రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. స్థానికంగా పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎస్పీ బంగ్లా రోడ్డులో వర్షపు నీటి ప్రవాహం కోసం రూ.25 లక్షలతో నిర్మించిన మేజర్ కాలువను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, పరిశీలకులు సునీల్ కుమార్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ పాల్గొన్నారు.

దాసార్లపల్లికి ఆర్టీసీ బస్సు పునఃప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పలమనేరు వయా దేవదొడ్డి దాసార్లపల్లి బస్సు గతంలో ప్రయాణిస్తూ ఉండేది, కొన్ని కారణాలవల్ల బస్సు రూట్ నిరుపయోగంగా ఉందని అప్పట్లో ఆపేశారు. కానీ టిడిపి ప్రభుత్వ మళ్లీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి చొరవతో పలమనేరు డిపో మేనేజర్ స్వామి సహకారంతో పలమనేరు టు వయా దేవదొడ్డి దాసర్లపల్లి బస్సు సర్వీసును గురువారం ఎమ్మెల్యే పచ్చ జెండా ఊపి పునఃప్రారంభించారు. దీంతో తీర్థం, గడ్డురు, ఎం.కొత్తూరు, శనిపల్లి, మునిపల్లి, కార్వేట 'రామానగరం, జుముగుండ్లపల్లి గ్రామాల వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తీర్థం పంచాయతీలోని 130 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.పలమనేరు డిపో మేనేజర్ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, తహశీల్దారు మాధవరాజు, మండలాధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, వీఆర్ఓ గువిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి, గోవింద్ స్వామి పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

త్వరలో అందుబాటులోకి దుకాణాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: దుకాణాల నిర్మాణాన్ని పూర్తిచేస్తామని ఏఎంసీ కార్యదర్శి గంగయ్య తెలిపారు. గురువారం సముదాయానికి మోక్షం ఎప్పుడు శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. వెంటనే ఉన్నతాధికారులతో చర్చించి దుకాణాల నిర్మాణాలు చేపడుతున్న గుత్తేదారును సంప్రదించి వారికి చెల్లించాల్సిన బిల్లులు చెల్లించి నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే దుకాణ సముదాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు: ఎస్పీ

ప్రజాశక్తి- కార్వేటినగరం




వివాస్పద భూమిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

జిల్లాలో ఎవరైనా అక్రమంగా భూములను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గంగమాంబాపురం గ్రామంలో గత కొద్ది రోజుల కాలంగా కొనసాగుతున్న భూ వివాదాల నేపథ్యంలో రెవెన్యూ అధికారుల సమీక్షంలో జిల్లా ఎస్పీ స్వయంగా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు భూములను అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల ఫిర్యాదు కార్యక్రమంలో తమకు ఫిర్యాదు చేసుకోవచ్చు అని తెలిపారు. మండలంలోని గంగమాంబాపురం గ్రామంలో గతకొంత కాలంగా భూ వివాదం కొనసాగుతున్నాయని, వాటి పరిష్కారం కోసం స్వయంగా గ్రామాన్ని సందర్శించడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు సిద్ధం చేసిన నివేదిక ప్రకారం బాధితులకు న్యాయం చేస్తామని, ఆ గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం కార్వేటినగరం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్, సిఐ హనుమంతప్ప, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆదిమూలం... గందరగోళం..!

- సస్పెన్షన్ సరే..ఇన్‌ఛార్జి ఎవరు?
- ఎంఎల్ఏ తీరుపై విమర్శల పర్వం
- సత్యవేడు టిడిపిలో గందరగోళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా సత్యవేడు టిడిపి పరిస్థితి ఉంది. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి. పార్టీ మారినా ఆయన తీరు మారలేదు. గతంలో వైసిపి హయాంలో ఎంఎల్ఏగా ఉన్న పుడు కొత్తగా పార్టీలోకి వచ్చిన టిడిపి కార్యకర్తలకు అందల మెక్కించారన్న కోపం అప్పటి వైసిపి కార్యకర్తల్లో ఉండేది. ప్రస్తుతం టిడిపి కండువా కప్పుకుని ఎంఎల్ఏగా గెలుపొందిన ఆదిమూలం ఏకపక్షంగా ఉంటూ ఎవరినీ కలుపుకుపోయే పరిస్థితి లేదు. దీంతో సత్యవేడు నియోజకవర్గం కార్యకర్తల్లో నిరాశ నెలకొంది. త్వరలోనే తనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తి వేస్తారని ఆదిమూలం అనుకుంటున్నా, అధిష్టానం మాత్రం అతనిపైన గుర్రుగానే ఉందని సమాచారం. అయితే ఎంఎల్ఏపై సస్పెన్షన్ వేటు విధించిన అధిష్టానం సైతం, ఇప్పటివరకూ సత్యవేడు నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిని ప్రకటించకపోవడమూ ఈ గందరగోళానికి కారణమయ్యిందని చెప్పవచ్చు.

సీఎం చంద్రబాబు సొంత జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి గందరగోళంగా మారింది. పదేళ్ల తర్వాత మొన్నటి ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఓ మహిళతో వీడియోలో కనిపించి అడ్డంగా బుక్కయ్యారు. దీంతో నియోజకవర్గంలో వెంటనే దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన టిడిపి అధిష్టానం..ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఆదిమూలాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోందన్న టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.త్వరలోనే కొత్త ఇన్‌ఛార్జిని నియమిస్తారని పార్టీ అధిష్టానం ప్రకటించినా, ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఎవరి నాయకత్వంలో పనిచేయాలో తెలియక సత్యవేడు తెలుగు తమ్ముళు అయోమయానికి గురవుతున్నారు.

కొనసాగుతున్న సస్పెన్షన్ వేటు

ఈ విషయంలో పార్టీ అధిష్టానంలో మాత్రం ఇంకా ఊగిసలాటే కనిపిస్తుందన్న వాదన విన్పిస్తోంది. ఎమ్మెల్యే ఆదిమూలంపై ఇంకా సస్పెన్షన్ వేటును కొనసాగిస్తూనే ఉంది. ఈ వ్యవహారం ఇలా ఉంటే సత్యవేడు టిడిపి నేతలు మాత్రం ఇదెక్కడి తలనొప్పి అంటూ తలలు పట్టుకుంటున్నారంట. పనుల కోసం ఎమ్మెల్యే వద్దకు వెళ్లాలా, వద్దా అని తేల్చుకోలేకపోతున్నారని సమాచారం. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ను సైతం నియమించకపోవడంతో ఇక్కడ అంతా గందరగోళ వాతావరణమే కన్పిస్తోంది. ఎవరినో ఒకరిని ఇన్చార్జ్ గా అయినా వేయండి లేదా ఆదిమూలంపై సస్పెన్షన్ను ఎత్తివేయండి అంటూ సత్యవేడు తెలుగు తమ్ముళ్లు నిలదీస్తున్నారని సమాచారం. గంగా ప్రసాద్ అనే సీనియర్ టిడిపి నేత పార్టీ తరపున నియోజకవర్గానికి పెద్దదిక్కుగా ఉంటున్నారట. ఆయన కనుసన్నల్లోనే సత్యవేడు నియోకజవర్గానికి సంబంధించిన పార్టీ వ్యవహారాలన్నీ కొనసాగుతున్నాయని సమాచారం.ఆయన ద్వారా నియోజకవర్గ పార్టీ ఇంన్చార్జి పదవి దక్కించుకునేందుకు చాలామంది స్థానిక నేతలు ఆయన వద్దకు క్యూ కడుతున్నారని తెలుస్తోంది. అయితే నియోజకవర్గంలోనూ గంగా ప్రసాద్ కు వ్యతిరేకవర్గం కూడా తయారైందట. మొన్నటి ఎన్నికల ముందు వరకు సత్యవేడు టిడిపి ఇంన్చార్జిగా కొనసాగిన మాజీ ఎమ్మెల్యే హేమలత సైతం ఇప్పుడు మళ్లీ ఇంన్చార్జి పదవిని ఆశిస్తున్నారన్న టాక్ నియోజకవర్గంలో కోడై కూస్తోందట. మొత్తం మీద సత్యవేడు నియోజకవర్గం విషయంలో ఆచితూచి వ్యవహరించాలని పార్టీ అధిష్టానం భావిస్తుండగా..లోకల్ కేడర్ మాత్రం ఈ తలనొప్పికి ఫుల్ స్టాప్ పడేదెప్పుడని ఎదురుచూస్తున్నారంట.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు మెగా డీఎస్సీ 2025 పరీక్షకు బీసీ, ఎస్సి, ఎస్టి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమం నిర్వహించబడుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవడానికి తమ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కె.మునీంద్రయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ 2025 మార్చి 10 నుండి ప్రారంభమైందని, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. దరఖాస్తుదారులు బీసీ, ఎస్సి, ఎస్టి, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి చెందిన వారై ఉండాలని, అభ్యర్థులు తమ సంబంధిత జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి, చిత్తూరు కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు కులధృవీకరణ పత్రం, జన్మస్థల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, టెట్ అర్హత ధృవీకరణ పత్రం సమర్పించాలన్నారు. దరఖాస్తుల చివరి తేదీ, కోచింగ్ ప్రారంభ తేదీ తదితర వివరాలు త్వరలో తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మెగా డీఎస్సీ 2025 పరీక్షకు సిద్ధం కావడానికి తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9177429494 సంప్రదించాలని తెలిపారు.

డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



క్రీడాప్రాంగణంలో ప్రారంభమైన డిపిఎల్ 13వ ఎడిషన్

ప్రజాశక్తి- కుప్పంటౌన్: అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాన్ని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పిఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్ఆర్ కృష్ణారావు తెలిపారు. కుప్పంలోని పిఈఎస్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల పరిధిలో ప్రతి సంవత్సరం అధ్యాపకులకు, విద్యార్థులకు మధ్య క్రీడాపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగానే డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ 13వ ఎడిషన్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ పోటీలలో మొత్తం 10జట్లు పాల్గొనాలని ఉన్నాయని, వీరికి టెన్నిస్ బాల్, క్రికెట్ ఆటలపోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డాక్టర్లు శశి భూషణ్, కల్యాణ్, భరత్, సంతోష్, విభాగాధిపతులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మ విశ్వాసం

మార్షల్ అకాడమీని ప్రారంభించిన ఎమ్మెల్యే అమర్



ప్రజాశక్తి- పలమనేరు: శారీరక మానసిక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గురువారం వీకే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన పలువురు చిన్నారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో క్రీడలతోపాటు మార్షల్ ఆర్ట్స్‌పై ప్రతిఒక్కరు దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్నప్పటి నుంచే మార్షల్ ఆర్ట్స్ పై మక్కువ పెరిగేలా చూడాలన్నారు. అకడమీ నిర్వాహకులను అభినందించారు. బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్‌వి బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, ఖాజా, నాగరాజు, మదన్, కిరణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

తిరుపతి- కాట్పాడి రైల్వే లైన్ ఎంపి కృషే..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఆర్ రాజన్

ప్రజాశక్తి:- చిత్తూరుఅర్బన్: తిరుపతి-కాట్పాడి డబ్లింగ్ రైల్వేలైన్ మంజూరుకు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఎంతగానో కృషి చేశారని టిడిపి, బిజెపి నేతలు కొనియాడారు. గురువారం స్థానిక తెలుగుదేశం జిల్లా కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్ మాట్లాడుతూ చిత్తూరు నగరవాసుల కళ నెరవేరిందన్నారు. వాణిజ్యపరంగా చిత్తూరు అభివృద్ధికి డబ్లింగ్ రైల్వే ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు రూ.1,332 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి నాయకులు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్‌లు పాల్గొన్నారు.

మే 11న వన్నియర్ కుల మహానాడు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మే 11వ తేదీన తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించే వన్నియర్ కుల మహానాడును విజయవంతం చేయాలని తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్ పిలుపునిచ్చారు. తమిళనాడులో నిర్వహించే ఈమహాసభలకు చిత్తూరు జిల్లాలోని వన్నియర్ కుల క్షత్రియులను ఆహ్వానించేందుకు సంఘం ముఖ్య నాయకులు శుక్రవారం తెలుగుదేశం జిల్లా కార్యాలయానికి విచ్చేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వన్నికుల క్షత్రియ మహాసభల విశేషాలను తెలియజేశారు.

ప్రతిభ చూపిన పిఈఎస్ విద్యార్థులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 12వ అఖిల భారత బాలలు, యువత కళాపోటి ప్రదర్శనలో భాగంగా, డ్రీమ్ యంగ్, చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 5వ తేదీన జరిగిన కాంపిటీషన్లో పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన నోషిత 9వ తరగతి, ఎన్.జే. లహరి 11వ తరగతి ఆల్ ఇండియా బాల చిత్రకళా అవార్డును సొంతం చేసుకున్నారు. అలాగే భిన్న తరగతులకు సంబంధించిన విద్యార్థులు 9 మంది బంగారు పతకాలను, 11 మంది వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే ఆర్ట్ మాస్టరు దినేష్ ఆలిండియా చిత్రకళా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు చిత్రకళలో ప్రతిభ చూపిన విద్యార్థులను, ఆర్ట్ మాస్టరు దినేష్‌ను అభినందించారు.

నోటు పుస్తకాలు పంపిణీ



ప్రజాశక్తి- వీకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ప్రిన్సిపల్ బాలకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశానుసారం విద్యార్థులకు చదువు భారం కాకూడదని భావించి అభ్యాసన సామర్థ్యం పెంపొందించి, వారిలో సృజనాత్మకతను పెంపొందించే దిశగా ఉచితంగా సబ్జెక్టు వారి పాఠ్యపుస్తకాలు, 12నోట్ పుస్తకాలను ప్రతి విద్యార్థికి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ పక్వాడ



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా గురువారం గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ వినతశ్రీ సూపర్వైజర్లు అంగన్వాడి సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోషకాహార పదార్థాలతో ప్రదర్శన నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, పిల్లలకు పోషకాహార నియమావళి గురించి అవగాహన కల్పించారు. రక్తహీనత ఏర్పడకుండా ప్రభుత్వం మంచి పోషక పదార్థాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న నేపథ్యంలో పిల్లలతో పాటు గర్భవతులు బాలింతలు తప్పనిసరిగా పోషక పదార్థాలను వినియోగించుకోవాలని సిడిపిఓ సూచించారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అగ్రికల్చర్ ఏవో భవాని, అంగన్వాడీ సూపర్వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ..!

ప్రజాశక్తి- రామకుప్పం: టిడిపి సభ్యత్వ కార్డులను టిడిపి నాయకులు బూత్ కన్వీనర్లకు అందజేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ గుర్తింపు కార్డులను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. దీంతో ప్రతి ఒక్క కార్యకర్తను గుర్తించి వారి సమస్యలపై సత్వరమే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, మహమ్మద్ రఫీ, గజేంద్ర, జయశంకర్, మునిరెడ్డి, విజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో చేరేందుకు దరఖాస్తులు

ప్రజాశక్తి- రామకుప్పం: స్థానిక గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, మొదటి ఇంటర్మీడియట్ బాలుర విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరం గాను ఆన్లైన్లో అప్లై చేసుకున్న వారు మాత్రమే హాజరు కావాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు, తల్లిదండ్రుల మొబైల్ నెంబర్లు తీసుకురావాలన్నారు.

సప్త సూత్రాలతో ప్రకృతి వ్యవసాయం



ప్రజాశక్తి- సోమల: సేంద్రియ ఎరువులను వ్యవసాయంలో వాడడం తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల ఆరోగ్యంతో పాటు నేల ఆరోగ్యం కూడా బాగుంటుందని ఏపిఎం శివ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో సిసిలు, ఎమ్మెస్ ఓబీలు, వీవోఏ, వీవోఓబిలతో ప్రకృతి వ్యవసాయంపై సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఎఫ్ఏ ఫైజునిషా మాట్లాడుతూ ప్రస్తుతం రసాయనిక ఎరువులతో చేస్తున్న వ్యవసాయ సేద్యం వల్ల రాబోయే తరాలలో నేల మనుషులు అనారోగ్యం పాలై భూమిలో నాటే విత్తనాలు మొలకెత్తే పరిస్థితి కూడా ఉండదని రాబోయే తరాల వారిని దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రకృతి వ్యవసాయంపై సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. దీనివల్ల మనుషులతో పాటు నేల కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం పాటించేందుకు ప్రభుత్వం సప్త సూత్రాలను అమలు చేస్తోందని వాటిని ప్రతి ఒక్క రైతు పాటించి తమ తోటి రైతుల ద్వారా కూడా పాటింపచేసి మేలైన ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు.

గంగాధర నెల్లూరు: ప్రకృతి వ్యవసాయం సాగించడంతోనే రైతులు ఆర్థికాభివృద్ధి చెందగలరని వ్యవసాయాధికారిణి భవాని అన్నారు. గురువారం గంగాధర నెల్లూరు మండలంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా చేపడుతున్న వార్షిక ప్రణాళికపై వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ విజయ మాట్లాడుతూ పిఎండిఎస్ పద్ధతిలో 25 నుండి 32 రకాల విత్తనాలు వేయడం వల్ల కలిగే లాభాల గురించి సంఘంలోని ప్రతి మహిళ 365 రోజులు పెరటి తోటలు వేసుకోవాలని సూచించారు. ఎస్‌డిఎ సరిత, ఎస్‌బిసి హేమావతి, ఏపిఎం ఫరీద్ మస్తాన్, రేవతి, ఐసిఆర్‌పి రైతులు పాల్గొన్నారు.

గుడిపల్లి: మండల వ్యవసాయ శాఖ, మండల సమాఖ్య సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై మండల స్థాయిలో సమన్వయ సమావేశాన్ని ఎపిఎం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యవసాయాధికారి అమృతవల్లి ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. చంద్రశేఖర్ కెపికె ఆవశ్యకతను వివరించారు. ఎన్ఎఫ్ఎ పున్నారావు, ఏపిఎం రీటా, మాస్టర్ ట్రైనర్ వెంకట రమణ, రైతులు పాల్గొన్నారు.

13న గురుకులం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని సర్వీరెడ్డిపల్లి బస్టాప్ వద్ద గల గురుకుల పాఠశాలలో ఈనెల 13వ తేదీన 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ జరుగుతుందని ప్రిన్సిపాల్ దమయంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ ఆదివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఐదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్న 2 నుండి 4 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు హాల్ టికెట్లతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్‌ను తీసుకురావాలన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జెసిఐ చిత్తూరు గోల్డ్ సంయుక్తంగా తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు తాగునీటి అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డాక్టర్ మౌనిక ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం వచ్చిన గర్భిణులకు, బాలింతలకు డాక్టర్ ప్రవీణ్, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డితో కలిసి మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఎంవి కేశవరెడ్డి ఫౌండేషన్, చైర్మన్ శ్రీధర్ రెడ్డి, జిడి నెల్లూరు బ్రాంచ్ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి సహదేవ నాయుడు, పరిపాలన అధికారి గోపి, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి, డాక్టర్లు మౌనిక, ప్రవీణ్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు



ప్రజాశక్తి- సోమల: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని సోమల వైసిపి నాయకులు ప్రజాప్రతినిధులు గురువారం కలిసి మండలంలోని సమస్యలను తెలియజేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, నాగేశ్వరరావు, సోమల మాజీ సర్పంచ్ శ్రీరాములు, నాయకులు సాంబయ్య, మల్లికార్జున ఎమ్మెల్యే ఎంపీలను కలిసి మండల సమస్యలు, కార్యకర్తల పరిస్థితులపై తెలియజేసినట్లు తెలిపారు. వారు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపినట్లు పేర్కొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం అన్నెమ్మగారిపల్లి గ్రామంలో గురువారం పంచాయతీ కార్యదర్శి లలిత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలుసారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి చల్లటి తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలిపారు.

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి గ్రామసర్పంచ్ గోవిందప్ప ఆధ్వర్యంలో గ్రామంలోని నెల్లిపట్ల రోడ్డు క్రాస్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మంచినీరు, మజ్జిగను అందుబాటులో ఉంచినట్లు సర్పంచ్ గోవిందప్ప తెలిపారు. పలమనేరు ఎంపీడీవో ఖాదర్ బాష, ఈవోఆర్‌డి రాజేంద్ర బాలాజీ, సెక్రెటరీ సుబ్రమణ్యం, వీరభద్ర పాల్గొన్నారు.

14న సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక



ప్రజాశక్తి- కుప్పంరూరల్ : కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 14వ తేదీ సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కమిటీ చైర్మన్ మహేశ్, ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఈనెల 26, 27 తేదీలో మదనపల్లిలో అంతర్ జిల్లాల సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో చిత్తూరు జిల్లా తరఫున క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి ఏప్రిల్ ఒకటి 2008 తర్వాత పుట్టిన బాలబాలికలు అర్హులని, ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 14వ తేదీన రామకుప్పం మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరగబోవు ఎంపిక పోటీలలో పాల్గొనాలని సూచించారు. ఈపోటీలకు వచ్చేవారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63018 31236, 96183 30565ను సంప్రదించాలని కోరారు. కమిటీ వైస్ ప్రెసిడెంట్ లోకానాథం, సెక్రటరీ వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ జబిర్, స్వాతి, సభ్యులు వేణు, సవితా పాల్గొన్నారు.

రోడ్లపై పేడదిబ్బలు వేస్తే జరిమానా


ప్రజాశక్తి- కార్వేటినగరం: రోడ్లపై పేడదిబ్బలు వేస్తే భారీ జరిమానాలు తప్పవని ఎంపీడీవో చంద్రమౌళి హెచ్చరించారు. గురువారం మండల పరిదిలోని కొల్లాగుంట వద్ద రోడ్లపై వేసిన పేడ దిబ్బలను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, ఇంటి ఆవరణాలు, వీధులు, రోడ్లపై పేడ దిబ్బలు వేసి జనజీవనానికి ఆటంకం కల్పించిన వారిపై జరిమానాలు విధించడమే కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యంటించి పారిశుధ్య లోపాలను గుర్తించి, మెరుగు పరచాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పారిశుధ్యం లోపించడం ద్వారా అనేక రకాలైన వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉందని, ఇది అందరూ గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దివ్య, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పేడదిబ్బలను తొలగిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకురావాలని వినతి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం డిపో ఆర్టీసీ స్థితిగతులను పరిశీలించి, ఆర్టీసీ డిపోను ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకురావాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కుప్పం డిపో నాయకులు ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కుప్పం డిపో ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తూ, లాభాలబాటలో పయనించేదని, క్రమేపి పలు కారణాల చేత కుప్పం ఆర్టిసి డిపో నష్టాల బాట పట్టిందన్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీసీ ప్రక్షాళనతోనే కుప్పం అభివృద్ధి ప్రారంభమవుతుందని ప్రకటించిన విషయం స్థానిక ప్రజలతోపాటు ఆర్టీసీ సిబ్బందిలో సైతం కొత్త ఆశలను చిగురింప చేసిందన్నారు. ఆయన ప్రకటించిన విధంగానే రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టిన అనంతరం స్థానిక ఆర్టిసి డిపోలో పలు అభివృద్ధి కార్యక్రమాలు మొదలైందని, ముఖ్యంగా పలు చోట్లకు బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించే విధంగా ఆర్టీసీ ముందుకు పోతుందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడంతోపాటు సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు వాటిపై సానుకూలంగా స్పందిస్తూ త్వరలో విజయవాడలో జరగబోవు బోర్డు సమావేశంలో కుప్పం ఆర్టీసీ ఉద్యోగుల వినతిపై చర్చించి, కుప్పం డిపోకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. టిడిపి నాయకులు గోపినాథ్, సత్యేంద్రశేఖర్, వ్యక్తిగత కార్యదర్శి భాస్కర్, కుప్పం డిపో మేనేజర్ గోపినాథ్, అసిస్టెంట్ మేనేజర్ ఎం.దినేష్, ఎన్ఎంయుఏ నాయకులు డిపో అధ్యక్షులు ఎస్.మునస్వామి, డిపో కార్యదర్శి ఈ.జయపాల్, డిపో ఛైర్మన్ బొట్టు మణి, డిపో సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, ఎస్ఎస్.శేషాద్రి పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

క్రికెట్ విజేతలకు బహుమతులు



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందించి మంచి ఆరోగ్యకరమైన అందిస్తాయని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తనయుడు రాహుల్ అన్నారు. గతవారం రోజులుగా పెద్ద తయ్యూరు గ్రామంలో ఆర్గనైజర్ రాజా ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలు నిలిచిన పిచ్చాటూరు ఉత్తర కండ్రిగ టీంకు మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ స్థానంలో రన్నర్‌గా నిలిచిన గంగాధర నెల్లూరు మండలానికి చెందిన బుక్కపట్నం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు రూ.25 వేలతోపాటు ట్రోఫీలను అందించారు. ఈటోర్నమెంట్‌లో 18 క్రికెట్ టీమ్‌లు పోటీలో పాల్గొన్నాయని, క్రీడాకారులను అందర్నీ అభినందించారు. మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ బాబు, ఎమ్మెల్యే వ్యక్తిగత సలహాదారుడు చంద్రశేఖర్, గురునాథం, చిరంజీవి, మధు, లోకేష్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిని త్వరగా పూర్తి చేస్తాం..

పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం పాతపేట పరిధిలోని ఆలయాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని కుప్పం పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజకుమార్ తెలిపారు. గురువారం ఆయన దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మునస్వామిపురంలోని శ్రీ ప్రసన్న ముత్తు మారెమ్మ దేవాలయం, శ్రీ కుంటి గంగమ్మ దేవాలయం, బైపాస్ రోడ్డు దోబి గాట్‌లోని ఉబ్బమ్మ దేవాలయాలను పర్యవేక్షించి, ఆలయాల అభివృద్ధికి చేపట్టవలసిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ఆలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి నిధులను కేటాయించడం జరిగిందని, మరిన్ని ఆలయాల అభివృద్ధికి సైతం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఆయన ఆదేశానుసారం, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంల సూచనల మేరకు శుక్రవారం పాతపేట పరిధిలోని ఆలయాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆలయాలను పరిశీలించిన దేవాదాయ శాఖ అధికారులు త్వరితగతిన ప్రణాళికలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపుతామని, వారి అనుమతులు అందిన వెంటనే ఆలయాల అభివృద్ధి పూర్తి చేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు రవి, దయ, నరేష్, నాగార్జున, వేణు, రాజు, వినయ్ పాల్గొన్నారు.



దేవాలయాన్ని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పలు పంచాయతీలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. కందూరు, సోమల, ఇరికిపెంట, ఆవులపల్లి, నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మగారిపల్లి పంచాయతీలలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేడదిబ్బలను జెసిబి ద్వారా తొలగించి ట్రాక్టర్లలో తరలించారు. అదేవిధంగా మురుగునీటి కాలువలలో చెత్తాచెదారాన్ని తొలగించి నీరు సజావుగా పారేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈవోఆర్డి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, మసూదా బేగం, మణికుమార్, లలిత కుమారి, ఆనంద్, మేనక పర్యవేక్షించారు.



క్రైం న్యూస్

డాక్టర్ల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యంతో తమ బిడ్డ చనిపోయాడని టి.వడ్డూర్‌కు చెందిన గణేశ్ ఆరోపించారు. 'పాలు తాగుతూ పొరపోవడంతో తమ బిడ్డ అస్వస్థతకు గురయ్యాడని, ఆసుపత్రికి తీసుకొస్తే డాక్టర్లు సరిగా పట్టించుకోకపోవడంతో బిడ్డ చనిపోయాడని తెలిపారు. గతంలోనూ తమ బంధువుల బిడ్డ ఇదే ఆసుపత్రిలో మృతిచెందాడంటూ ఆ తండ్రి బోరున విలపించారు. చిన్నారి బంధువులు బోరున విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది.

నాటుసారా స్వాధీనం- ఇద్దరు అరెస్టు



ప్రజాశక్తి- విజయపురం: నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల విజయపురం మండలంలోని కెవిపురం గ్రామంలో పోలీసులు నాటు సారాయి తయారీపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీదారులు, రవాణాదారులు నుండి 500 కేజీల నల్లబెల్లం, 10 లీటర్ల నాటు సారా, ఓ వాహనాన్ని సీజ్ చేశారు. సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరు తమిళనాడుకు చెందిన నటరాజన్, పాండియన్‌గా గుర్తించారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : శక్తి యాప్స్, బాల్య వివాహలు, మహిళల అత్యవసర నంబర్ల పై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మహిళా ఇన్స్పెక్టర్ మహేశ్వర్ తెలిపారు. గురువారం గుడిపాల మండలంలోని శ్రీలక్ష్మి నరసింహ ఫార్మసీ కాలేజ్‌లో మహిళా ఇన్స్పెక్టర్ మహేశ్వర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ యువతి, మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా అవసరం అన్నారు. మహిళా ఎస్ఐ నాగ సౌజన్య, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త రమేష్ తల్లి నాచారమ్మ 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు, గురువారం కర్మ క్రియలు నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ కుతుహలమ్మ తనయుడు ఆనగంటి హరికృష్ణ పాల్గొని రమేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్ని వేళల కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. విజయబాబు, కోటిరెడ్డి బాబు, నాగేష్, రమేష్ , సంపత్, రాము పాల్గొన్నారు.

మాజీ జెడ్పిటిసికి పరామర్శ



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యులు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డిని గురువారం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి పరామర్శించారు. ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బంది పడుతున్నాట్లు కార్యకర్తల ద్వారా సమాచారం అందుకున్న నారాయణస్వామి వెంటనే ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

హంస వాహనంపై కాశీ విశ్వేశ్వరుడు

ప్రజాశక్తి- రామకుప్పం: అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగ హంస వాహనంపై ఆలయ మాడవీధుల్లో చిత్విలాసం చేశారు. గురువారం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. సాయంత్రం కర్ణాటక సాంప్రదాయ వీరభద్ర నృత్యాలు, టిటిడి ధర్మప్రచార పరిషత్ ద్వారా ఆధ్యాత్మిక సంకీర్తనలు ఆలపించారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వెంకటరమణ నాయుడు కుటుంబీకులు వ్యవహరించారు.

నేడు, రేపు తుంబురు తీర్థ ముక్కోటి

ప్రజాశక్తి - తిరుమల: శుక్ర, శనివారాల్లో తిరుమలలో తుంబురుతీర్థ ముక్కోటి జరగనుంది. ఉదయం 5 గంటల నుంచి పది గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఇస్తారు. భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్ళు పైబడిన వద్ధులు, గుండె, శ్వాస కోస సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు. భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. పోలీసుశాఖ, అటవీశాఖ, టీటీడీ విజిలెన్స్ విభాగం సమన్వయంతో పాపవినాశనం నుండి తుంబురు తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నారు. తీర్థానికి వెళ్లే మార్గంలో సూచి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీని దష్టిలో ఉంచుకుని గోగర్భం డ్యామ్ సర్కిల్ నుండి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతి ఉండదు.

టీటీడీకి 100 సైకిళ్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారికి గురువారం చెన్నైకి చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ 100 సైకిళ్లు విరాళంగా అందజేసింది. కంపెనీ ప్రతినిధులు సైకిళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. శ్రీవారి ఆలయ పేష్కార్ రామ కృష్ణ, ఇన్ ఛార్జ్ డిఐ హరి బాబు పాల్గొన్నారు.